www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

పాల్వంచలో వడ్డీ వ్యాపారుల 'మాయాజాలం'..



3 లో..

సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



6 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 288, సోమవారం 16-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులివ్వండి..

తెలంగాణకు అండగా నిలవండి!



- *ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి*
- *తుమ్మిడిహెట్టి నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని అభ్యర్థన..*
- *సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల అదనపు నిధులు ఇవ్వాలని వినతి..*
- *పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు అనుమతులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరిన సీఎం*

ఢిల్లీ, నవంబర్ 15 :

తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు మంజూరు చేయడంతో పాటు అంతర్రాష్ట్ర జలవివాదాల పరిష్కారానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేశామని, భూసేకరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం త్వరితగతిన అందజేస్తున్నామని వివరించారు. ఢిల్లీలోని ప్రధానమంత్రి అధికారిక నివాసంలో మోదీతో ముఖ్యమంత్రి సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సమావేశంలో కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.

మిగతా 2 లో..

ఖేలో ఇండియా యువజన క్రీడలకు తెలంగాణ ముస్తాబు!



- *అధికారిక చిహ్నం, మస్కట్‌లను ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ*
- *డిసెంబర్ 11 నుంచి 22 వరకు పోటీలు.. 27 క్రీడాంశాల్లో 7 వేల మందికి పైగా క్రీడాకారుల ప్రతిభాప్రదర్శన*
- *మూడేళ్లలో క్రీడా బడ్జెట్ రూ.113 కోట్ల నుంచి రూ.465 కోట్లకు పెంపు*

ఢిల్లీ, నవంబర్ 15 :

తెలంగాణ వేదికగా నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యువజన క్రీడలు-2026కు రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న ఈ క్రీడా సంబరాలకు సంబంధించిన అధికారిక చిహ్నం, మస్కట్‌లను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఆవిష్కరించారు. ఢిల్లీలోని కేంద్ర మంత్రి అధికారిక నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మిగతా 2 లో..

కాంగ్రెస్, బీజేపీ నేతల తీరు తెలంగాణ ఆత్మగౌరవానికి భంగం: కేటీఆర్

- *జాతీయ పార్టీల నాయకులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ విమర్శలు*
- *గాంధీ కుటుంబం వద్ద సీఎం రేవంత్ వ్యవహారశైలిపై వ్యాఖ్యలు*
- *అమిత్ షా పర్యటన సందర్భంగా బీజేపీ నేతల తీరుపై ఆక్షేపణ*
- *ప్రజలు ఇచ్చిన పదవుల గౌరవాన్ని కాపాడాలని హితవు*

హైదరాబాద్, నవంబర్ 15



తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నాయకుల వ్యవహారశైలిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఆయా పార్టీల్లో కీలక పదవుల్లో ఉన్న నాయకులు తమ హోదాకు తగిన హుందాతనం, గౌరవాన్ని పాటించడం లేదని ఆరోపించారు. ప్రజలు ఇచ్చిన పదవుల గౌరవాన్ని దిగజార్చేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జాతీయ పార్టీల నాయకుల ముందు రాష్ట్రానికి చెందిన నేతలు వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ఆత్మ గౌరవం దెబ్బతింటోందని

మిగతా 2 లో..

కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి

- *నాంపల్లి పార్టీ కార్యాలయంలో అన్ని సెల్స్ సమావేశం*
- *రాబోయే పార్టీ కార్యక్రమాలపై కార్యకర్తలకు : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు దిశానిర్దేశం*
- *ప్రధాని మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించాలని సూచన*
- *కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపు*

హైదరాబాద్, నవంబర్ 15



కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన విజయాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ అన్ని సెల్స్ సమావేశంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన పార్టీ కార్యక్రమాలు, ప్రజల్లోకి వెళ్లాల్సిన అంశాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ శ్రేణులు

మిగతా 2 లో..

దివ్యాంగులు, వృద్ధులకు ఉచితంగా సహాయ ఉపకరణాలు

- *నేటి నుంచి హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రత్యేక శిబిరాలు*
- *అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందించడమే లక్ష్యం*
- *రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్*



హుస్నాబాద్, నవంబర్ 15

హుస్నాబాద్ నియోజకవర్గంలోని దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా సహాయ ఉపకరణాలు అందించేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నవంబర్ 16 నుంచి 27వ తేదీ వరకు నియోజకవర్గంలోని ఏడు మండలాలు, హుస్నాబాద్ మున్సిపాలిటీలో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. నడవడానికి, వినడానికి, చూడడానికి, నిత్యావసర పనులు చేసుకోవడానికి ఎవరి సహాయం కోసం ఎదురుచూడకుండా

మిగతా 2 లో..



మహిళలు ఆర్థికంగా ఎదిగి.. వ్యాపారవేత్తలుగా నిలవాలి

- *మహిళా సంఘాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది*
- *మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం*
- *రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క*

మల్లారెడ్డిపల్లి, నవంబర్ 15

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది, వ్యాపారవేత్తలుగా ఎదగాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే కుటుంబాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయం, మహిళా సమాఖ్య భవనాలను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణితో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. అనంతరం చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 70 లక్షల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని, గత మూడేళ్లలో బ్యాంకు అనుసంధానం, స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాలకు సుమారు రూ.70 వేల కోట్ల రుణాలు అందించినట్లు వివరించారు.

మిగతా 2 లో..

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Follow : @bhadradrinews
సోమవారం
16 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులివ్వండి..

తెలంగాణకు అండగా నిలవండి!



(మొదటి పేజీ తరువాయి)

తుమ్మిడిహెట్టికి మహారాష్ట్రను ఒప్పించండి

ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్రప్రభుత్వాన్ని ఒప్పించాలని ప్రధానమంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఇటీవల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో జరిగిన సమావేశం వివరాలను ప్రధానికి వివరించారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తెలంగాణలోని వెనుకబడిన, గిరిజన ప్రాంతాలకు సాగు, తాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు గురుత్వాకర్షణ శక్తి ద్వారా నీటిని వినియోగించుకునే అవకాశం ఈ ప్రాజెక్టుతో కలుగుతుందని వివరించారు.

పెండింగ్ అనుమతులు వెంటనే మంజూరు చేయాలి

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టు, డిండి ఎత్తిపోతల పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం భారీగా వ్యయం చేసినప్పటికీ పర్యావరణ, ఇతర చట్టబద్ధమైన అనుమతులు పెండింగ్‌లో ఉండటంతో ఆశించిన ప్రయోజనాలు అందడం లేదని సీఎం ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. పర్యావరణ అనుమతుల విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన సానుకూల తీర్పు నేపథ్యంలో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన అనుమతులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణకు అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వండి

రాష్ట్రంలో 70 నుంచి 90 శాతం వరకు పనులు పూర్తయిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రత్యేక పెట్టుబడి సహాయ పథకం కింద అదనంగా రూ.5 వేల కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే నిధులు విడుదల చేస్తే కొత్త ఆయకట్టుతో పాటు ఇప్పటికే ఉన్న ఆయకట్టుకు స్థిరీకరించిన సాగునీటి సరఫరా అందించేందుకు వీలవుతుందని వివరించారు. తద్వారా రైతుల ఆదాయం, గ్రామీణ ఉపాధి అవకాశాలు, ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుతాయని తెలిపారు.

సమ్మక్కసాగర్‌కు ఛత్తీస్‌గఢ్ సహకారం అవసరం

సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను ఇప్పటికే కేంద్ర జల సంఘానికి సమర్పించినట్లు ప్రధానికి వివరించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం, వెనుక జలాల మట్టం ఆధారంగా ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే భూములు, గ్రామాలను గుర్తించేందుకు సమగ్ర సర్వే నిర్వహించి అందుకు రూ.9.88 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని, ఆ రాష్ట్రం నుంచి నిరభ్యంతర పత్రం త్వరగా వచ్చేలా సహకరించాలని ప్రధానిని కోరారు.

కేంద్ర నిధుల కోసం సీఎం విజ్ఞప్తి

ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద పలు సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం ఆర్థిక సహకారం అందించాలని సీఎం కోరారు. సమగ్ర సమ్మక్కసాగర్ ప్రాజెక్టుసీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.5,183 కోట్లు, మోడికుంట వాగు ప్రాజెక్టుకు రూ.392 కోట్లు, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.171 కోట్లు, చనాకాకొరాటా బ్యారేజీకి రూ.103 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఖేలో ఇండియా యువజన క్రీడలకు ప్రధానికి ఆహ్వానం

మరోవైపు హైదరాబాద్‌లో డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యువజన క్రీడల ప్రారంభ, ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను అందజేయడంతో పాటు క్రీడల చిహ్నం, మస్కట్‌ల గురించి వివరించారు. భవిష్యత్తులో ఆసియా క్రీడలు, ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించే యువ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ఈ పోటీలు చక్కని వేదికగా నిలుస్తాయని తెలిపారు. 2002లో జాతీయ క్రీడలు, 2007లో ప్రపంచ మిలిటరీ క్రీడలను విజయవంతంగా నిర్వహించిన అనుభవం తెలంగాణకు ఉందని ప్రధానికి వివరించారు.



ఖేలో ఇండియా యువజన క్రీడలకు తెలంగాణ ముస్తాబు!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లా కేంద్రాల్లో ఖేలో ఇండియా క్రీడలు నిర్వహించేందుకు అవసరమైన క్రీడా ప్రాంగణాలను సిద్ధం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. మొత్తం 27 క్రీడాంశాల్లో 7 వేల మందికి పైగా క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా యువ క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఈ పోటీలు గొప్ప వేదికగా నిలవనున్నాయని పేర్కొన్నారు.

క్రీడా బడ్జెట్‌కు భారీగా పెంపు

రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం తెలిపారు. గత మూడేళ్లలో రాష్ట్ర క్రీడా బడ్జెట్‌ను రూ.113 కోట్ల నుంచి రూ.465 కోట్లకు పెంచినట్లు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు.

61 మినీ స్టేడియాల నిర్మాణం పూర్తి

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 61 మినీ స్టేడియాల నిర్మాణం పూర్తయిందని, మరో 15 స్టేడియాల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, సాధన సౌకర్యాలు కల్పించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు రాణించేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. ఖేలో ఇండియా యువజన క్రీడల నిర్వహణతో తెలంగాణ క్రీడారంగానికి మరింత గుర్తింపు లభించడంతో పాటు యువ ప్రతిభకు కొత్త అవకాశాలు అందనున్నాయి.

మహిళలు ఆర్థికంగా ఎదిగి.. వ్యాపారవేత్తలుగా నిలవాలి

(మొదటి పేజీ తరువాయి)

మహిళలకు అందించే రుణాలపై వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోందని చెప్పారు. గతంలో పొదుపు, కుటుంబ అవసరాలకే పరిమితమైన మహిళా సంఘాలు నేడు వివిధ రంగాల్లో వ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నాయని అన్నారు. మేడారం జాతర సందర్భంగా మహిళా సంఘాలకు సుమారు రూ.3 కోట్ల రుణాలు అందించగా, కేవలం పది రోజుల్లో రూ.6 కోట్ల ఆదాయం ఆర్జించారని వివరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సరస్ మేళాలో మహిళలు తయారుచేసిన ఉత్పత్తుల విక్రయాల ద్వారా పది రోజుల్లో సుమారు రూ.10 కోట్ల ఆదాయం పొందారని తెలిపారు.

మహిళలకు పెట్రోల్ బంకుల నిర్వహణ, బస్సుల కొనుగోలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ వంటి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ద్వారా గత వానాకాలం సీజన్‌లో మహిళా సంఘాలకు సుమారు రూ.160 కోట్ల కమీషన్ ఆదాయం వచ్చిందన్నారు. మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ యూనిట్లు, గోదాములు, ఇందిరా మహిళా శక్తి భవనాలు, క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 250 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభించామని, వీటి ద్వారా మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు ప్రజలకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాల సభ్యుల కుటుంబాలకు భరోసా కల్పించేందుకు బీమా సదుపాయాలు కల్పిస్తున్నామని, మరణించిన సభ్యుల రుణాలను మాఫీ చేస్తున్నామని తెలిపారు. మహిళల ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూ ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరుతోనే మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ఒంటరి మహిళలు, భర్తను కోల్పోయిన మహిళలు, దివ్యాంగులను గుర్తించి కొత్త పింఛన్లు అందించేందుకు సర్వే నిర్వహించామని, సుమారు 4.5 లక్షల మంది అర్హుల తుది జాబితా సిద్ధమైందని తెలిపారు. ఈ నెల 19వ తేదీ తర్వాత వారి బ్యాంకు ఖాతాల్లో పింఛన్ డబ్బులు జమ అవుతాయని వెల్లడించారు.

మల్లారెడ్డిపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవనం, రూ.10 లక్షలతో మహిళా సమాఖ్య భవనం నిర్మించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, సీసీ రోడ్లు, రూ.3.50 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాలని స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతులు, విద్యార్థులు, మహిళలు, పేదల సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తూ ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలతో ప్రజలకు మేలు చేస్తున్నామని చెప్పారు. మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు.

ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుపేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు తదితర అర్హులైన వర్గాలకు కొత్తగా 4.5 లక్షల పింఛన్లు మంజూరు చేసిందని తెలిపారు. రాష్ట్రానికి భారీగా అప్పులు ఉన్నప్పటికీ బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తోందన్నారు. మహిళలకు పెద్దపీట వేయడం వల్ల గతంలో పురుషులు నిర్వహించిన అనేక వ్యాపారాలను నేడు మహిళలు విజయవంతంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుపేదలకు సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం, కొత్త పింఛన్లు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల మహిళలు సమావేశాలు నిర్వహించుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక భవనాలు నిర్మిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో మహిళా క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, ఇతర వ్యాపార అవకాశాలు కల్పిస్తూ వారికి ఆర్థిక భరోసా అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఉచితంగా

సహాయ ఉపకరణాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవంతో జీవించేలా అవసరమైన సహాయ ఉపకరణాలను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, తన ప్రత్యేక చొరవతో కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని ఏడీఐపీ పథకం కింద భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ సహకారంతో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ శిబిరాల్లో అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు మోటారు ట్రైసైకిళ్లు, చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు, కృత్రిమ అవయవాలు, చేతికర్రలు, కళ్లద్దాలు, నడకకు ఉపయోగపడే ఇతర సహాయక పరికరాలను ఉచితంగా అందించనున్నారు. 80 శాతానికి పైగా వైకల్యం ఉన్న అర్హులకు విద్యుత్‌తో నడిచే ట్రైసైకిళ్లు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

శిబిరాల నిర్వహణ వివరాలు:

* నవంబర్ 16, సోమవారం: సైదాపూర్ మండలం - ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణం.
* నవంబర్ 17, మంగళవారం: ఎల్కతుర్తి మండలం - ఎస్.ఎం.ఆర్. ఫంక్షన్ హాల్, వరంగల్ రోడ్డు.
* నవంబర్ 18, బుధవారం: అక్కన్నపేట మండలం - రైతుబజార్ / ఉన్నత పాఠశాల.
* నవంబర్ 20, శుక్రవారం: కోహెడ మండలం - లక్ష్మీ గార్డెన్.
* నవంబర్ 21, శనివారం: చిగురుమామిడి మండలం - మహాలక్ష్మి ఫంక్షన్ హాల్, చిన్న ముల్కనూరు.
* నవంబర్ 25, బుధవారం: హుస్నాబాద్ గ్రామీణ ప్రాంతం - మున్సిపాలిటీ.
* నవంబర్ 26, గురువారం: హుస్నాబాద్ పట్టణం - మున్సిపాలిటీ.
* నవంబర్ 27, శుక్రవారం: భీమదేవరపల్లి మండలం - ప్రభుత్వ ఉన్నత పాఠశాల.

అన్ని శిబిరాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు.

అర్హులకు సమాచారం చేరవేయాలి

నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ గ్రామాలు, మండలాల పరిధిలోని అర్హులైన దివ్యాంగులు, వృద్ధులను గుర్తించి శిబిరాల వివరాలను వారికి తెలియజేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్దేశిత తేదీల్లో ఉదయం 10 గంటలకు సంబంధిత శిబిరాలకు హాజరయ్యేలా ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ తీసుకోవాలని కోరారు. గ్రామాల్లోని అర్హులందరికీ ఈ పథకం ద్వారా ప్రయోజనం కలిగేలా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏ ఒక్క దివ్యాంగుడు, వృద్ధుడు కూడా సహాయం అందక ఇబ్బందులు పడకూడదని, ప్రతి ఒక్కరికీ అవసరమైన ఉపకరణాలు అందించి స్వతంత్రంగా, ఆత్మగౌరవంతో జీవించేలా చేయడమే తమ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు.

కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)



సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు చేరువ కావాలని సూచించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని రామచందర్‌రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి చర్యల సమాచారాన్ని కేవలం సమావేశాలకే పరిమితం చేయకుండా ప్రతి ఇంటికీ చేరవేయాలని సూచించారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని రామచందర్‌రావు విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజలకు చేసిన వాగ్దానాలు, వాటి అమలులో జరుగుతున్న జాప్యం, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీజేపీ ఆరోపిస్తున్న అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.

రాబోయే పార్టీ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు. ప్రతి సెల్ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రచారం చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ హామీల అమలుపై ప్రజల తరపున ప్రశ్నించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు, అన్ని సెల్స్ సమన్వయకర్త అమర్‌నాథ్ సారంగుల, వివిధ విభాగాలకు చెందిన నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. రాబోయే కార్యక్రమాల నిర్వహణ, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై సమావేశంలో చర్చించారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను వివరించడం, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని నాయకులు నిర్ణయించారు.

కాంగ్రెస్, బీజేపీ నేతల తీరు తెలంగాణ ఆత్మగౌరవానికి భంగం



(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహారశైలిని ప్రస్తావిస్తూ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. గాంధీ కుటుంబానికి బాడీగార్డుల్లా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ బైక్ వెనుక కాంగ్రెస్ మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు పరుగులు తీయడం రాష్ట్ర నాయకుల హోదాకు తగిన విధానం కాదని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి ముఖ్యమైన పదవుల్లో ఉన్నవారు తమ గౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. బీజేపీ నాయకుల వ్యవహారశైలిపైనా కేటీఆర్ ఆక్షేపణ వ్యక్తం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన సందర్భంగా తెలంగాణకు చెందిన ఒక కేంద్ర మంత్రి ఆయన చెప్పులు మోశారని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఆయన కాళ్లు మొక్కారని ఆరోపించారు. రాష్ట్రానికి చెందిన నాయకులు జాతీయ స్థాయి నేతల ముందు ప్రదర్శిస్తున్న ఈ తరహా వైఖరి ప్రజలు ఇచ్చిన పదవుల గౌరవాన్ని తగ్గించేలా ఉందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ నేతల తీరు అత్యంత సిగ్గుచేటుగా, అవమానకరంగా ఉందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలు తమ నాయకులకు అప్పగించిన బాధ్యతలు, పదవులు వ్యక్తిగత విధేయతను ప్రదర్శించేందుకు కాదని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన నాయకులు తమ హోదాకు తగిన గౌరవాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. జాతీయ పార్టీల నాయకుల పట్ల చూపుతున్న విధేయత కంటే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రాధాన్యం ఇవ్వాలని పరోక్షంగా హితవు పలికారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావమే ఆత్మగౌరవ పునాదులపై జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల గౌరవం స్వాభిమానం తెలంగాణ రాజకీయాల్లో కీలకమైన విలువలని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ జాతీయ నాయకత్వాలు ఈ విలువలను అర్థం చేసుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రానికి చెందిన నాయకులు తమ పదవుల గౌరవాన్ని కాపాడుకుంటూ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

అవకాశవాదంతోనే విభజిత రాజకీయాలు

- సంఘం అంటే వనభోజనాలు కాదు.. కాపులందరి ఐక్యత కోరుకోవడం
- రాబోయే ఎన్నికల్లో ఖమ్మం కార్పొరేషన్ కైవసం దిశగా కాపులు కదలాలి
- మేకల సంగయ్య కాపు సంఘానికి కూడబెట్టిన ఆస్తులపై వివరణ ఇవ్వాలి
- కార్తీక వన సమారాధనలో తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండాల(ఆర్జీసీ) కృష్ణ
- ఏపీ నుంచి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి అంబటి రాంబాబు
- ఉర్రూతలూగించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అవకాశవాదం, వ్యక్తిగత ప్రయోజనాల కోసమే కొందరు విభజిత రాజకీయాలకు పూనుకుని పిచ్చివాగుడు వాగుతున్నారని తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండాల(ఆర్జీసీ) కృష్ణ మండిపడ్డారు. సంఘం అంటే ఒకచోట చేరి భోజనాలు చేయడం కాదని, విడిపోయినా కూడా కాపులను ఐక్యంగా ముందుకు తీసుకెళ్లడమని ఉద్ఘాటించారు. ఆదివారం ఖమ్మంలోని కాళ్ళ రామారావు మామిడి తోటలో అట్టహాసంగా నిర్వహించిన మున్నూరు కాపు కార్తీకమాస వన సమారాధన ఉత్సవం కృష్ణ అధ్యక్షతన జరిగింది. తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం, మున్నూరు కాపు జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేదికకు అధ్యక్షుడిగా వ్యవహరించిన ఆయన మాట్లాడుతూ వన భోజనాలు నిర్వహించి గొప్పలు చెప్పుకునే నాయకులు ఏనాడు కాపు కులస్తులకు అండగా నిలవలేదని విమర్శించారు. సంఘం అంటే కేవలం భోజనాలు పెడితే సరిపోదని, కాపులకు ఆపద వచ్చినప్పుడు అండగా నిలబడే ఒక ధైర్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. 2014 ఎన్నికల్లో ఒక కాపు సంఘ ముద్దుబిడ్డగానే గుర్తించి కేసీఆర్ తనకు ఖమ్మం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారని వివరించారు. తనను మనస్ఫూర్తిగా నమ్మిన కారణంగానే ఆయన తన ఇంట్లో బస చేశారని గుర్తు చేశారు. దీన్ని కూడా కొందరు హర్షించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా పని చేస్తున్న సమయంలోనూ అనేక రకాలుగా కుట్రలు పన్ని మార్కెట్లో గొడవలు సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో కాపు కులస్తుడైన వి. హనుమంతరావు కూడా ప్రత్యర్థులకు మద్దతు పలికి తనకు వ్యతిరేకంగా విషం చిమ్మడం విచారకరమని పేర్కొన్నారు. కాపు సంఘం అధ్యక్షుడిగా పని చేసిన మేకల సంగయ్య సంఘం సంక్షేమం కోసం అనేక ఆస్తులను కూడపెట్టారని గుర్తు చేశారు. ఆ ఆస్తులు ప్రస్తుతం కొందరు కబ్జాలో ఉండిపోవడం దురదృష్టకరమన్నారు. సదరు ఆస్తులపై స్పష్టమైన వివరణ ఇవ్వకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గడచిన 11 ఏళ్లుగా ఒకే ఒక్కరు ఆ సంఘానికి నాయకుడిగా వ్యవహరిస్తున్నారని సదరు నాయకుడు వన భోజనాలు తప్ప మున్నూరు కాపుల సంక్షేమంపై ఏనాడు చర్చించిందిలేదని దుయ్యబట్టారు. రాబోయే ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేషన్ కైవసమే ప్రధాన ఎజెండా కాపులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గతంలో రాపర్తి రంగారావు, నాగమల్లిక పని చేశారని, భవిష్యత్తులోనూ కార్పొరేషన్ వేదికగా మున్నూరు కాపుల నాయకత్వం వర్ధిల్లాలని దిశా నిర్దేశం చేశారు. తొలుత ఇటీవల అనారోగ్యంతో మరణించిన కాపు సంఘ నాయకులు శభాసు శ్రీనివాస్ ఎర్ర శ్రీకాంత్ పొదిల దేవేందర్ తదితరులకు సభా వేదిక నుంచి నివాళి అర్పించారు నిమిషం పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.



కాపుల శాతం తగ్గడంపై ప్రశ్నించేది ఎవరు..?
- మున్నూరు కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్ధన్

స్వాతంత్రం వచ్చిన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోనూ, రాష్ట్రం విడిపోయిన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కాపుల సంఖ్యాబలం 18 శాతంగా ఉందని, తాజాగా ఆ సంఖ్య 3.5 శాతానికి తగ్గిపోయిందని మున్నూరు కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఏ సంఘ నాయకుడు ప్రశ్నించిన దాఖలాలు లేవన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ఏబిసిడి వర్గీకరణ విషయంలో తమకు ఒక శాతం అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఒక ఉద్యమమే లేవనెత్తారని తెలిపారు. అలా ప్రశ్నించిన కారణంగా ప్రస్తుతం సీఎం పరిశీలనలో వారి సమస్య ఉందని పేర్కొన్నారు. అలాంటిది మున్నూరు కాపుల సంఖ్యాబలం తగ్గడంపై ప్రశ్నించకపోవడం వల్లే ప్రభుత్వాలు కాపులను బలహీనం చేస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ తో పాటు తెలంగాణ మంత్రివర్గంలో కూడా గతంలో ఐదు నుంచి ఆరుగురు మంత్రులు ఉండేవారని, తాజాగా తెలంగాణ క్యాబినెట్లో ఒక్క కాపు నేత కూడా లేకపోవడం శోచనీయమన్నారు. అధికార యంత్రాంగంలో క్రమంగా మున్నూరు కాపులు నిర్వీర్యం అవుతున్నారని ఆవేదన చెందారు. ముఖ్యంగా వ్యాపారపరంగా, ఉద్యోగ పరంగా, అనగదొక్కబడుతున్న మున్నూరు కాపు కుటుంబ సభ్యులను మనందరం ఐక్యంగా పోరాడి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వంపై తిరుగుబాటు చేయడానికి కూడా వెనకాడవద్దని తెలిపారు. తోటి నాయకత్వంపై కక్షపూరితంగా వ్యవహరిస్తే ఐక్యత చాటలేరని గుర్తు చేశారు. కాపు కులస్తులు ఏ రాజకీయ పార్టీలో ఉన్నప్పటికీ సమస్య వస్తే పరిష్కారం కోసం ఏకతాటిపై ముందుకు కదలాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రాలు విడిపోయిన రాంబాబు మీ వాడే..
- ఏపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు

తెలుగు రాష్ట్రం రెండుగా విడిపోయినా అంబటి రాంబాబు ఎప్పటికీ ఇరు రాష్ట్రాల మున్నూరు కాపు కుటుంబీకుడేనని ఏపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ తనపై దాడి చేసిన సమయంలో తెలంగాణ నుంచి కూడా పలువురు కాపు కులస్తులు తనకు ఫోన్ చేసి విచారం వ్యక్తం చేశారని, కారకులపై కఠిన చర్యకు డిమాండ్ చేశారని తెలిపారు. ఇది తనకు ఎంతో బలాన్ని ఇచ్చిందని వివరించారు. ఏ పార్టీలో పని చేసినప్పటికీ కులమనేది ఒక గొప్ప అండ, చెప్పలేనంత మనోధైర్యాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. రాజకీయంగా ఎన్నో విభేదాలు ఉన్నప్పటికీ కాపులం ఐక్యంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏదైనా సందర్భం వచ్చినప్పుడు ఐక్యం కాకపోతే ఈ సమాజంలో కాపులను లెక్కచేయరన్నారు. ఆర్ జె సి కృష్ణ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఈ సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమని కొనియాడారు. ఏ పార్టీలో పని చేసినా నిజమైన సేవ చేసే వాడే మున్నూరు కాపు గర్వంగా చెప్పారు. ఏ సమయంలో ఎలాంటి ఆపద వచ్చిన కాకితో కబురంపితే వచ్చి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు.

ఉర్రూతలూగించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

మున్నూరు కాపు కార్తీకమాస వన సమారాధన ఉత్సవానికి నీరజారెడ్డి యాంకర్ గా వ్యవహరించగా సింగర్ సంపత్ సినీ గీతాలతో అలరించారు. మన తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబజేసేలా చూపిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే హర్షిత, కీర్తన చిన్నారుల భరతనాట్యం అబ్బురపరిచింది. మొత్తం మీద సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ మాజీ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్, వైసిపి అవనిగడ్డ అధ్యక్షుడు కడవకొల్లు నరసింహారావు, ఖమ్మం సుడా మాజీ చైర్మన్, కాపు సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బచ్చు విజయకుమార్, సలహాదారు లక్కినేని రఘు, గౌరవాధ్యక్షుడు బచ్చు మధు, అడ్వైజర్ ఆకుల మూర్తి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పొన్నం వెంకటేశ్వర్లు, మూలగుండ్ల శ్రీహరి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్, కాపు సంఘం ట్రెజరర్ పిన్ని కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ లక్కినేని సుధీర్, కాపు సంఘం రాష్ట్ర కన్వీనర్ మడూరి సైదారావు, నగర అధ్యక్షుడు కనకం భద్రయ్య, మహిళ అధ్యక్షురాలు రంగరాజు ఊర్మిళ, యూత్ ప్రెసిడెంట్ మాటేటి కిరణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎర్ర జ్ఞానేశ్, జేఏసీ జిల్లా ప్రెసిడెంట్ ఎర్ర అప్పారావు, నాయకులు రాపర్తి రాజా, నరాల నరేష్, తోట కనకారావు, రాకం శ్యామ్, పెద్దిబోయిన నాగరాజు, మాటేటి రవి, బండి నవీన్, వెన్న పండు, పత్తి శ్రీనివాస్, ఆకుల లక్ష్మి, రాధిక, సరస్వతి, మాటేటి రామారావు, హరినాథ్ పాల్గొన్నారు. అలాగే గౌడ సంఘ నేత కత్తి నెహ్రూ గౌడ్, పద్మశాలి సంఘ నేత బొమ్మ రాజేశ్వరరావు ఈ వన సమారాధనలో పాల్గొని సంఘీభావం పలికారు.







24 సార్లు రక్తదానం.. మరెందరికో ప్రాణదానం!

- అబ్దుల్ రెహమాన్ (జుబ్బు)కు ప్రతిభా పురస్కారం
- అత్యవసర సమయాల్లో రక్తదాతలను సమకూరుస్తూ విశేష సేవలు

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 15 (భద్రాద్రిన్యూస్): ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తూ, అత్యవసర సమయాల్లో రక్తదాతలను సమకూరుస్తూ సామాజిక సేవలో తనదైన గుర్తింపు తెచ్చుకున్న అబ్దుల్ రెహమాన్ (జుబ్బు) ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. గుంటూరులో కేబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 15న నిర్వహించిన 8వ వార్షికోత్సవం--2026 వేదుకల్లో నిర్వాహకులు ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఇప్పటివరకు 24 సార్లు బి పాజిటివ్ రక్తదానం చేయడంతో పాటు, ఆపదలో ఉన్న రోగులకు అత్యవసర సమయాల్లో రక్తం అందేలా దాతలను సమన్వయం చేస్తూ చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడటమే కాకుండా, అవసరమైన సమయంలో రక్తదాతలను అందుబాటులోకి తీసుకురావడం ఎంతో అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జేబీ బాలు, వీరు, మొక్కల బాలు, రాజేష్, వినోద్ కుమార్ తదితరులు అబ్దుల్ రెహమాన్ (జుబ్బు)ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.







సోషల్ మీడియా ప్రభావంపై అవగాహన.. అనుబంధాల ప్రాధాన్యతపై చర్చ!

కోదాడలో ఘనంగా 'ఇన్స్టాగ్రామ్ రీల్స్ అండ్ రిలేషన్స్' కార్యక్రమం

కోదాడ, నవంబర్ 15(భద్రాద్రి న్యూస్): ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, ఇన్స్టాగ్రామ్ రీల్స్తో పాటు నిజ జీవితంలో మానవ సంబంధాలు, కుటుంబ అనుబంధాల ప్రాధాన్యతను చాటిచెప్పే ఉద్దేశంతో కోదాడ పట్టణంలో 'ఇన్స్టాగ్రామ్ రీల్స్ అండ్ రిలేషన్స్' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమం సందడిగా సాగింది.మాతంగి శైలజ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కోదాడ మున్సిపల్ చైర్పర్సన్ ఎర్నేని కుసుమ బాబు, నాయకులు భద్రం భద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి ఆధునిక సాంకేతిక ప్రపంచంలో సోషల్ మీడియా ప్రతి ఒక్కరి జీవితంలో భాగంగా మారిందని, ముఖ్యంగా యువతలో ఇన్స్టాగ్రామ్ రీల్స్ పట్ల ఆసక్తి పెరుగుతోందని పేర్కొన్నారు. సోషల్ మీడియాను కేవలం వినోదానికే పరిమితం చేయకుండా, ప్రతిభను వెలికితీసేందుకు, సృజనాత్మకతను ప్రదర్శించేందుకు, సమాజానికి మంచి సందేశాలను అందించేందుకు వినియోగించుకోవాలని సూచించారు.అదే సమయంలో వర్చువల్ ప్రపంచంలో ఎంత సమయం గడిపినా, నిజ జీవితంలోని కుటుంబ బంధాలు, స్నేహ సంబంధాలు, ఆత్మీయతకు ప్రాధాన్యత ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెరుగుతున్నప్పటికీ, మనుషుల మధ్య ప్రత్యక్ష అనుబంధాలు మరింత బలంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ జిల్లేపల్లి నాగేశ్వరరావు, అద్దంకి పద్మ, హైమా, బోట్ల శ్రావణి, షేక్ ఫర్జానా, శాంతా, సైదా, హారిక, పొదిల శ్రీనివాస్,ఎస్.ఎన్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, స్థానికులు పాల్గొని సందడి చేశారు.సోషల్ మీడియా వినియోగంతో పాటు నిజ జీవిత అనుబంధాల విలువను గుర్తుచేసిన ఈ కార్యక్రమం కోదాడ పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పాల్వంచ కేటీపీఎస్ ఏడవ దశలో విషాదం..

- విధుల్లో ఉండగా ప్రమాదవశాత్తూ ఆర్టిజన్ కార్మికుడు మృతి!

పాల్వంచ, నవంబర్ 15 (భద్రాద్రి న్యూస్):
పాల్వంచ కేటీపీఎస్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విధుల్లో భాగంగా కోల్ ప్లాంట్ వద్ద పనిచేస్తున్న వెంకటేశ్వర్లు అనే ఆర్టిజన్ కార్మికుడు ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయాడు. స్థానిక పోలీసులకు బాధితురాలైన భార్య చేసిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... పాల్వంచ వెంకటేశ్వర హిల్స్ కాలనీకి చెందిన పెంబల వెంకటేశ్వర్లు (50) కేటీపీఎస్లో ఆర్టిజన్ గ్రేడ్-2గా గత 8 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. కాగా, ఆదివారం ఉదయం యథావిధిగా డ్యూటీకి వెళ్లిన ఆయన, మధ్యాహ్నం సుమారు 12:40 గంటల సమయంలో కేటీపీఎస్ 7వ స్టేజ్ కోల్ ప్లాంట్ వద్ద విధులు నిర్వహిస్తుండగా.ట్రక్ ఆఫర్ టైప్ డీంది= వ్యాగన్స్ ద్వారా వచ్చిన కోల్ ఆన్ లోడ్ చేసే క్రమంలో, తన తోటి ఉద్యోగికి ఎయిర్ పైప్ అందించి. మరో వ్యాగన్ బాక్స్ వద్దకు ప్లాట్ఫాం పైనుంచి నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తూ ఆయనకాలుజారింది. ప్లాట్ఫాంకు ఉన్న గ్రిల్ కు, టైస్ వ్యాగన్ బాక్స్ మధ్యలో పడి ఇరుక్కుపోవడంతో ఆయన కుడి చేయికి, తుంటి భాగంలో బలమైన గాయాలయ్యాయి.



అది గమనించిన తోటి ఉద్యోగులు కాకారాల సుబ్బారావు, గడ్డం సత్యనారాయణ, బోడ రాములు వెంటనే ఆయన్ను బయటకు తీసి, చికిత్స నిమిత్తం పాల్వంచలోని కేటీపీఎస్ హాస్పిటల్కు తరలించారు. అయితే, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ అకస్మిక ప్రమాదంపై కుటుంబ సభ్యులకు ఎవరిపైనా ఎలాంటి అనుమానం లేదని, విచారించి తగినన్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు. కార్మికుడి మృతితో కేటీపీఎస్ కార్మిక వర్గంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.



పాల్వంచలో వడ్డీ వ్యాపారుల 'మాయాజాలం'..

- 4 లక్షల అప్పుకు... నాలుగు రెట్లు సొమ్ము స్వాహా!
- బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు..

పాల్వంచ, నవంబర్15 (భద్రాద్రి న్యూస్):
పారిశ్రామిక ప్రాంతంగా పేరున్న పాల్వంచలో ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల ఆగడాలు రోజురోజుకు హద్దుమీరుతున్నాయి. అత్యవసర పరిస్థితులను అడ్డుపెట్టుకుని అమాయకులను నిండా ముంచేస్తున్న వడ్డీ వ్యాపారుల బండారం తాజాగా బట్టబయలైంది.

అసలు ఏం జరిగింది?
పాల్వంచకు చెందిన 61 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగి తన అత్యవసర అవసరాల కోసం, నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని ఒక వడ్డీ వ్యాపారి వద్ద నూటికి మూడు రూపాయల వడ్డీ చొప్పున రూ. 4 లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పు ఇచ్చే సమయంలోనే పూచీకత్తు పేరుతో ఖాళీ బాండ్ పేపర్లు, ప్రామిసరీ నోట్లు, బ్యాంక్ చెక్కులపై వేలిముద్రలు తీసుకున్నారు. అయితే అసలు, వడ్డీతో సహా మొత్తం అప్పు చెల్లించినప్పటికీ... ఆ పత్రాలను వెనక్కి ఇవ్వకుండా ఆ వ్యాపారి కాలయాపన చేస్తూ వచ్చాడు. ఇక్కడే అసలు సినిమా మొదలైంది! బాధితుడికి తెలియకుండా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని అతని ఖాతాకు వేరే మొబైల్ నంబర్ను అనుసంధానించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద ఖాతాలో జమ అయిన సొమ్మును విడతల వారీగా వేరే ఖాతాలకు మళ్ళించి, నాలుగు రెట్ల సొమ్మును గుట్టుచప్పుడు కాకుండా కాజేసినట్లు బాధితుడు ఆరోపిస్తున్నాడు.

- సెటిల్మెంట్ల పేరుతో బెదిరింపులు..
?తన డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీసిన బాధితుడిపైనే నిందితులు ఎదురుదాడికి దిగారు. గతంలో తీసుకున్న ఖాళీ పత్రాలను అడ్డుపెట్టి తప్పుడు కేసుల్లో ఇరికిస్తామని, కులం పేరుతో దూషిస్తూ భౌతిక దాడికి పాల్పడతామని బెదిరింపులకు దిగుతున్నారు. ఈ వివాదాన్ని సెటిల్మెంట్ చేయాలంటూ ఒక రౌడీషీటర్, కేటీపీఎస్ ఉద్యోగి రంగంలోకి దిగి ప్రాణహాని హెచ్చరికలు చేస్తుండటంతో బాధితుడు తీవ్ర భయాందోళనకు గురవుతున్నాడు.

- అధికారుల సమగ్ర విచారణకు డిమాండ్! : కేవలం అప్పు లావాదేవీల వివాదంగానే కాకుండా, బ్యాంకు ఖాతాకు మొబైల్ నంబర్ ఎలా మారుడింది? ఓటీపీలు, డిజిటల్ లావాదేవీలు ఎవరు నిర్వహించారు? అనే కోణంలో లోతైన దర్యాప్తు జరగాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వృద్ధులు, నిరక్షరాస్యులు, ఆర్థికంగా బలహీన వర్గాల ప్రజలను లక్ష్యంగా చేసుకుని ప్రైవేట్ వ్యాపారులు సాగిస్తున్న ఈ దోపిడీపై అధికార యంత్రాంగం పక్కా ప్రణాళికతో నిఘా పెట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో బాధితుడు ఫిర్యాదు చేసినట్లు సమాచారం..

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
సోమవారం
16, నవంబర్, 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

గన్నవరంలో వ్యక్తిత్వ వికాసం పై ఇంఫాక్ట్ కార్యక్రమం



వైరా, నవంబర్ 15, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ మండల పరిధి గన్నవరం గ్రామంలో ఆదివారం ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని (ఎల్ఎఫ్ఎల్) హెచ్ ఎం పరిధిలో పి.లత ఆధ్వర్యంలో ఇంపాక్ట్ సమస్త ద్వారా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, వ్యక్తిగత అభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణ, సామాజిక అవగాహన, తల్లిదండ్రుల బాధ్యతలు, పిల్లల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. అలాగే పిల్లల అభ్యాసన స్థాయిని మెరుగుపరచడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, ప్రత్యేక శ్రద్ధ అవసరమైన విద్యార్థులను గుర్తించి తగిన సహాయ సహకారాలు అందించటం వంటి అంశాలపై వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి వైరా మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు, ఇంపాక్ట్ సమస్త ప్రతినిధులు ఎండి నవాబ్ పాషా, విడిఎస్ ప్రసాద్, బి. కర్ణ తదితరులు పాల్గొన్నారు

వైరాలో దేవన్ జనరల్ హాస్పిటల్ ప్రారంభం

- ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రధాన లక్ష్యం
- ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా, నవంబర్ 15, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ పట్టణ పాత బస్టాండ్ సమీపంలో యూనియన్ బ్యాంక్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన దేవన్ జనరల్ హాస్పటల్ ను ఆదివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ఆస్పటల్ నిర్వాహకులు డాక్టర్ లాలు బాబుతో కలిసి రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రి సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంతో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తూ వైద్యరంగంలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలని కోరారు. వైద్యులు సేవా భావంతో పనిచేస్తూ రోగుల పట్ల బాధ్యతాయుతంగా నిర్వహించాలని అన్నారు. వైరా నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ దేవన్ జనరల్ హాస్పిటల్ మంచి గుర్తింపు తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మండల, పట్టణ, అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, వీరం శెట్టి సీతారాములు, కట్ల రంగారావు, లైలా వెంకటరెడ్డి, రాంపూడి రోశయ్య, డాక్టర్ కోటయ్య, ఎంబిబిఎస్ ఎండి డాక్టర్ లాలు బాబు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోమవారం గ్రామ మామిడి తోటలో ఘనంగా కమ్మ వన సమారాధన

కార్తీక వన సమారాధన మహోత్సవంలో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు



వైరా, నవంబర్ 15, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ సోమవారం గ్రామ కమ్మ జనసేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా ఆదివారం వన సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, రాష్ట్ర ఐ డి సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ ముప్వ విజయ్ బాబు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, ఏపీ కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జ అజయ్ కుమార్, డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య, కట్టా కృష్ణార్జున రావు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, పట్టణ ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్మ జనులందరూ ఐక్యంగా ఉండి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. రాజకీయంగా, సేవా రంగాలలో ముందుండాలని, రాబోయే రోజుల్లో సంఘం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేసి, కమ్మ కులాన్ని సమాజంలో ముందు వరుసలో నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరింపజేశాయి.

వైరాలో సోమవారం గ్రామ మామిడి తోటలో ఘనంగా ఆర్యవైశ్య సంఘం కార్తిక వన సమారాధన



వైరా, నవంబర్ 15, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ సోమవారం గ్రామం మామిడి తోటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తిక మాసం సందర్భంగా వన సమారాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆర్యవైశ్య ప్రముఖులు మాట్లాడుతూ ఆర్య వైశ్యులు అందరూ ఐక్యంగా ఉండి, సామాజిక సేవ కార్యక్రమాలలో ముందు వరసలో ఉండి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని రంగాలలో రాణిస్తూ ప్రత్యేక గుర్తింపుతో సమాజ మార్పు కోసం ప్రతి ఒక్కరం కృషి చేయాలని, రాజకీయ రంగాలలో, సామాజిక కార్యక్రమాలలో ప్రతి ఒక్కరం ఐక్యతగా ఉండి పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, వైరా మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్ కుమార్, పట్టణ సంఘం అధ్యక్షులు ధారా వెంకటకృష్ణ, మహిళా అధ్యక్షురాలు బొగ్గవరపు సునీత, మహిళా పట్టణ అధ్యక్షురాలు అను మోలు కుమారి, తదితర ఆర్యవైశ్య మహిళలు పురుషులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరింపజేశాయి.

స్వర్గీయ అనంతుల లక్ష్మీనారాయణ కుటుంబానికి తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రూ.లక్ష ఆర్థిక సహాయం

- హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో కుమార్తె అనంతుల మధులికకు చెక్కు అందజేత
- ఉద్యోగుల సంక్షేమానికి, ఆపదలో ఉన్న కుటుంబాలకు సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది -- రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు
- విధి నిర్వహణలో ఒత్తిళ్లు, వేధింపులు ఎదురైనా తొందరపాటు నిర్ణయాలు వద్దు.. న్యాయ సహాయ కమిటీ ద్వారా అండగా ఉంటాం



పాల్వంచ, నవంబర్ 15(భద్రాద్రి న్యూస్) : హైదరాబాద్‌లోని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం (ఫ్రూఖా) రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సంఘం అధ్యక్షులుగా సేవలందించిన స్వర్గీయ అనంతుల లక్ష్మీనారాయణ కుటుంబానికి రాష్ట్ర సంఘం తరఫున రూ.1,00,000 (ఒక లక్ష రూపాయలు) ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును స్వర్గీయ అనంతుల లక్ష్మీనారాయణ కుమార్తె అనంతుల మధులికకు రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందజేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ , తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం తన సభ్యుల సంక్షేమానికి, ఆపద సమయంలో వారి కుటుంబాలకు అండగా నిలవడానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. స్వర్గీయ అనంతుల లక్ష్మీనారాయణ సంఘానికి అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర సంఘం తరఫున లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత, సభ్యుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సంఘం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

అదేవిధంగా ఉద్యోగులు విధి నిర్వహణలో భాగంగా ఎలాంటి ఇబ్బందులు, ఒత్తిళ్లు లేదా వేధింపులు ఎదుర్కొన్నప్పటికీ ఆవేశానికి లోనై ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ఈగ వెంకటేశ్వర్లు సూచించారు. ఉద్యోగరీత్యా ఎదురయ్యే సమస్యలను సంఘం దృష్టికి తీసుకురావాలని, అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్ర కమిటీ వారికి పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసరమైతే సంఘం ఆధ్వర్యంలోని న్యాయ సహాయ కమిటీని సంప్రదించాలని, కమిటీ ద్వారా సమస్యలకు సంబంధించి అవసరమైన న్యాయపరమైన సలహాలు, సూచనలు అందించడంతో పాటు తగిన న్యాయ సహకారం కూడా అందిస్తామని తెలిపారు. ఏ ఉద్యోగి కూడా సమస్యలతో ఒంటరిగా కుంగిపోవద్దని, మనోధైర్యంతో సమస్యలను ఎదుర్కోవాలని సూచించారు. పద్మశాలి ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవం, సంక్షేమ పరిరక్షణకు తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని రాష్ట్ర అధ్యక్షులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలె బాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు గంజి రామ్మోహన్, పిట్ట ఉమాదేవి, రాష్ట్ర కోశాధికారి రాపోలు సోమేశ్వర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీపీయూఎస్ ప్రధాన కార్యదర్శి దూలం నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు జీవిత బీమా భరోసా..

- ఇందిరమ్మ జీవిత బీమా పథకం
- నవంబర్ 19 నుంచి ప్రారంభం.. ఒక్క రూపాయి చెల్లించకుండానే బీమా సౌకర్యం
- డీసీసీ కార్యదర్శి ధరావత్ బద్రు నాయక్



కారేపల్లి, భద్రాద్రి న్యూస్ (రాములు): ప్రజా పాలనలో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని డీసీసీ కార్యదర్శి ధరావత్ బద్రు నాయక్ అన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నవంబర్ 19 నుంచి ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనుందని తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని, బీమా పాలసీకి సంబంధించిన పూర్తి మొత్తాన్ని ప్రభుత్వమే భరించనుందని పేర్కొన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న యజమాని అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే, ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఈ జీవిత బీమా పథకం అండగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి పేద కుటుంబం ఈ పథకానికి అర్హులని, కుటుంబంలోని భార్య లేదా భర్తలో ఒకరి పేరుపై జీవిత బీమా పాలసీ చేయించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. పాలసీదారులు తమకు నచ్చిన విధంగా ఒకరు, ఇద్దరు లేదా ముగ్గురిని నామినీలుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ అధికారులే నేరుగా కుటుంబాల వద్దకు వచ్చి వివరాలు సేకరించి పాలసీ నమోదు ప్రక్రియను చేపడతారని వెల్లడించారు. పేదల సంక్షేమం, కుటుంబాల భవిష్యత్తుకు భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో గొప్పదని బద్రు నాయక్ కొనియాడారు. పేద ప్రజలకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా జీవిత బీమా సౌకర్యం కల్పించడం ప్రజా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఇంతటి బృహత్తర సంక్షేమ పథకాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్‌కు ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేస్తున్నట్లు డీసీసీ కార్యదర్శి ధరావత్ బద్రు నాయక్ పేర్కొన్నారు.

నూతన వధూవరులకు కారేపల్లి కాంగ్రెస్ నాయకుల ఆశీర్వాదం!

- యాదవ సంఘం నాయకుడు చిత్తారి సింహాద్రి యాదవ్ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ నేతలు



కారేపల్లి, నవంబర్ 15 (భద్రాద్రి న్యూస్ -- రాములు): ఖమ్మం జిల్లా యాదవ సంఘం నాయకుడు చిత్తారి సింహాద్రి యాదవ్ -- మాధవి దంపతుల కుమార్తె జోషిత వివాహ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు కారేపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు హాజరై నూతన వధూవరులను ఆప్యాయంగా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు పూలమాలలు వేసి, అక్షింతలు చల్లి వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. జీవితంలో పరస్పర అవగాహనతో ముందుకు సాగుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అడ్డగోడ ఐలయ్య, ఇమ్మడి తిరుపతిరావు, దేగల ఉపేందర్, ఇమ్మడి రామనాథం, పుట్ట ఉపేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. వధూవరుల కుటుంబ సభ్యులను కలిసి వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ వేడుకలో సందడి చేశారు.

అనంతరంలో విషాదం.. కుసుమ మృతికి సర్పంచ్ మోతి వీరస్వామి ఘన నివాళి!

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన రేగులగూడెం సర్పంచ్



కారేపల్లి, నవంబర్ 15
(భద్రాద్రి న్యూస్ -- రాములు): మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని అనంతరం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఈసం కుసుమ (ఏడబ్ల్యూహెచ్) శనివారం రాత్రి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుసుమ మృతి విషయం తెలుసుకున్న రేగులగూడెం గ్రామ సర్పంచ్ వీసం మోతి వీరస్వామి వెంటనే గ్రామానికి చేరుకుని ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. కుసుమ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆప్తురాలిని కోల్పోయిన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోతి వీరస్వామి మాట్లాడుతూ.. గ్రామంలో ఎవరికి ఆపద వచ్చినా, కష్టం ఎదురైనా అండగా నిలవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యతని పేర్కొన్నారు. ప్రజల సుఖదుఃఖాల్లో భాగస్వామిగా ఉంటూ వారికి నైతికంగా అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసం ఐలయ్య, భాస్కర్, పాపారావు, సాంబయ్య, కాంగ్రెస్ నాయకుడు అడ్డగోడ ఐలయ్య, సర్వయ్య తదితరులు పాల్గొని కుసుమ భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

అర్హులందరికీ రాజీవ్ యువ వికాసం అమలు చేయాలి!

- ఖాళీ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి
- పి.వై.ఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వి. రాకేష్ డిమాండ్



ఖమ్మం, భద్రాద్రి న్యూస్ (రాములు): రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ అమలు చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పి.వై.ఎల్) రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వి. రాకేష్ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారని, పరిమిత సంఖ్యలో లబ్ధిదారులను ఎంపిక చేయడం వల్ల అనేకమంది అర్హులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వం అదనపు బడ్జెట్ కేటాయించి అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు, సబ్సిడీలు అందించాలని కోరారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం, అవినీతికి తావులేకుండా పారదర్శక విధానాన్ని అనుసరించాలని సూచించారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల వివరాలను శాఖల వారీగా ప్రకటించి, వాటి భర్తీకి స్పష్టమైన కార్యాచరణతో జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని జిల్లా కార్యదర్శి జక్కుల భరత్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి అందించాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతంగా కల్పించాలని అన్నారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం కాలయాపన చేయడం తగదని, యువత ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే యువతను సమీకరించి పి.వై.ఎల్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఎన్.వి. రాకేష్, జక్కుల భరత్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్. ధరణి కృష్ణ, నాయకులు తోట రమేష్, మామిడాల వెంకటేష్, పరికపల్లి మధు, కొత్త రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్ అందకపోవడంతో ఆత్మహత్యాయత్నం!

- పురుగుల మందు తాగిన దివ్యాంగుడు.. ఎనిమిదేళ్లుగా మంచానికే పరిమితం!
- ప్రమాదంలో వెన్నెముక దెబ్బతిని నరకయాతన.. అధికారుల నిర్లక్ష్యానికి బలవుతున్న పేదల జీవితాలు!
- అంగడి రాజుకు అండగా నిలిచేదెవరు? ఆదుకుంటుందా ప్రభుత్వం.. న్యాయం జరిగేనా?



చర్ల 15 నవంబర్ (భద్రాద్రి న్యూస్) : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలకు అందుతున్నాయా? లేక కాగితాలకే పరిమితమవుతున్నాయా? ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా పేదల బతుకుల్లో మాత్రం మార్పు రావడం లేదనే ప్రశ్నలు మరోసారి తెరపైకి వస్తున్నాయి. ఎనిమిదేళ్లుగా మంచానికే పరిమితమై, కనీసం తన అవసరాలను కూడా తాను తీర్చుకోలేని దుస్థితిలో ఉన్న ఓ దివ్యాంగుడికి ఆసరా పెన్షన్ అందకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలచివేస్తోంది.

ప్రమాదంతో మారిపోయిన జీవితం!

అంగడి రాజు జీవితం ఒకప్పుడు సాధారణంగానే సాగేది. కానీ జరిగిన రోడ్డు ప్రమాదం ఆయన జీవితాన్ని ఒక్కసారిగా తలకిందులు చేసింది. ప్రమాదంలో వెన్నెముక తీవ్రంగా దెబ్బతినడంతో కదలలేని పరిస్థితి ఏర్పడింది. అప్పటి నుంచి దాదాపు ఎనిమిదేళ్లుగా మంచానికే పరిమితమై జీవనం సాగిస్తున్నాడు. నడవలేడు.. సొంతంగా పనులు చేసుకోలేడు.. ఇతరుల సహాయం లేకుండా కనీస అవసరాలు తీర్చుకోలేని దయనీయ పరిస్థితి. కుటుంబ సభ్యులపై ఆధారపడుతూ రోజులు వెళ్లదీస్తున్నాడు.

ఆసరా ఇవ్వాల్సిన ప్రభుత్వమే ఆదుకోకపోతే ఎలా?

నిజంగా ఆసరా అవసరమైన వ్యక్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోతే ఇక ఎవరికి అందాలి? ఎనిమిదేళ్లుగా మంచానికే పరిమితమైన దివ్యాంగుడికి పెన్షన్ అందించడంలో ఇబ్బందులు ఏమిటి? అర్హతలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాల్సిన అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. నడవలేని వ్యక్తి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి తన సమస్యను చెప్పుకోలేని పరిస్థితిలో ఉంటే అధికారులు కనీసం అతని ఇంటికి వెళ్లి పరిస్థితిని పరిశీలించాల్సిన బాధ్యత లేదా?

పురుగుల మందు తాగేంతటి దుస్థితి ఎందుకొచ్చింది?

ఆసరా పెన్షన్ అందకపోవడం, అనారోగ్య పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురైన అంగడి రాజు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ఒక మనిషి జీవించడానికి కావాల్సిన కనీస భరోసా కూడా అందని పరిస్థితి ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. అయితే ఒక దివ్యాంగుడు ఆత్మహత్యాయత్నం చేసేంతటి మానసిక వేదనకు గురయ్యాడంటే అతని పరిస్థితిని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వానికి కనిపించని దివ్యాంగుడి కన్నీళ్లు!

ఎన్నికల సమయంలో పేదల సంక్షేమం, దివ్యాంగుల అభ్యున్నతి, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అంటూ హామీలు గుప్పించే పాలకులు.. క్షేత్రస్థాయిలో నిజంగా సహాయం అవసరమైన అంగడి రాజు లాంటి బాధితుల పరిస్థితిని ఎందుకు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంక్షేమ పథకాలు ప్రచారానికే పరిమితమైతే వాటి వల్ల పేదలకు ప్రయోజనం ఏమిటి? నడవలేని దివ్యాంగుడు తన బాధను ఎవరికి చెప్పుకోవాలి? ప్రభుత్వ కార్యాలయాల గడప తొక్కలేని నిస్సహాయులకు ప్రభుత్వమే అండగా నిలవాల్సిన అవసరం లేదా?

ఇప్పటికైనా స్పందించాలి.. అంగడి రాజుకు న్యాయం చేయాలి!

జిల్లా కలెక్టర్, సంబంధిత సంక్షేమ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి అంగడి రాజు పరిస్థితిని స్వయంగా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ఆయనకు అవసరమైన మెరుగైన వైద్య సహాయం అందించడంతో పాటు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం దివ్యాంగుల పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైతే ప్రత్యేక వైద్య బృందంతో పరీక్షలు నిర్వహించి, అర్హతను నిర్ధారించి పెన్షన్ అందించాలి. కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు కూడా ప్రభుత్వం చొరవ చూపాలి.

ప్రశ్న ఒక్కటే.. అంగడి రాజుకు ఆసరా ఎప్పుడు?

ఎనిమిదేళ్లుగా మంచానికే పరిమితమైన ఓ దివ్యాంగుడికి జీవించడానికి అవసరమైన కనీస ఆర్థిక భరోసా కల్పించలేని వ్యవస్థ ఉన్నట్లుండి అతని ఆత్మహత్యాయత్నం తర్వాతైనా మేల్కొంటుందా? మరొక ప్రాణం ప్రమాదంలో పడే వరకు అధికారులు ఎదురుచూస్తారా? పేదల కన్నీళ్లు తుడవాల్సిన ప్రభుత్వమే వారి బాధలను పట్టించుకోకపోతే ఇక ఎవరిని ఆశ్రయించాలి? అంగడి రాజుకు కావాల్సింది కనికరం కాదు.. బతకడానికి భరోసా! జాలి చూపడం కాదు.. రాజ్యాంగబద్ధంగా లభించాల్సిన సంక్షేమ పథకాలు అందించడం! ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి అంగడి రాజుకు న్యాయం చేయాలి. ఆయన కుటుంబానికి అండగా నిలవాలి. లేదంటే సంక్షేమ పాలన అన్న మాటలకు అర్థం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు!

మేరా యువ భారత్ యూత్ వాలంటీర్‌గా చామకూరి సాయి వంశీ గౌడ్ ఎంపిక

- పాల్వంచ--లక్ష్మీదేవిపల్లి బ్లాక్ బాధ్యతలు అప్పగింత
- యువత అభివృద్ధి, క్రీడల ప్రోత్సాహానికి కృషి చేస్తా: సాయి వంశీ



పాల్వంచ, నవంబర్ 15 (భద్రాద్రి న్యూస్): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేరా యువ భారత్ -- ఖమ్మం సంస్థకు సంబంధించి పాల్వంచకు చెందిన చామకూరి సాయి వంశీ గౌడ్ పాల్వంచ--లక్ష్మీదేవిపల్లి బ్లాక్ యూత్ వాలంటీర్‌గా ఎంపికయ్యారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, సామాజిక సేవా కార్యక్రమాల్లో యువతను భాగస్వాములను చేయడం లక్ష్యంగా మేరా యువ భారత్ పనిచేస్తోంది. ఈ క్రమంలో గతంలో యూత్ క్లబ్ ద్వారా సాయి వంశీ గౌడ్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. యువతలో చైతన్యం కల్పిస్తూ, సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారు. ఆయన సేవా దృక్పథం, యువతను సమన్వయం చేసే సామర్థ్యం, సామాజిక కార్యక్రమాల పట్ల ఉన్న ఆసక్తిని గుర్తించిన మేరా యువ భారత్ అధికారులు ఈ బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా సాయి వంశీ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి యూత్ వాలంటీర్‌గా ఎంపిక చేసిన మేరా యువ భారత్ ఖమ్మం జిల్లా అధికారులకు, సంబంధిత యువజన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ యువత అభివృద్ధికి, క్రీడల ప్రోత్సాహానికి, సామాజిక సేవా కార్యక్రమాల విస్తరణకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

స్మార్ట్ కిడ్జ్ లో ఆనందోత్సవాలతో బాలల దినోత్సవం

- పలు రకాల పోటీలలో సృజనాత్మకతను చాటిన చిన్నారులు.





ఖమ్మం ప్రతినిధి,నవంబర్ 14 (భద్రాద్రిన్యూస్): స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం జాతీయ బాలల దినోత్సవం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. తొలుత చాచా నెహ్రూ చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య, పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్యలు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. పిల్లలలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయడానికి నిర్వహించిన ఈ పోటీలలో చిన్నారులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఫ్యాన్సీ డ్రెస్ పోటీలలో చిన్నారులు వివిధ రకాల వేషధారణలతో అలరించారు. విద్యార్థులకు నిర్వహించిన ఆటలు పోటీలు, చెస్ పోటీలలో తమ సత్తా చాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో చిన్నారులు పాల్గొని తమ ఆలోచనలకు పదును పెట్టారు. అనంతరం వివిధ పోటీలలో విజయం సాధించిన పాఠశాల విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ నవంబర్ 14 బాలలందరికి గొప్ప పండుగ అని, విద్యార్థుల సృజనను వెలికి తీయడానికి బాలల దినోత్సవం దోహద పడుతుందని తెలిపారు. స్వతంత్ర్య భారతదేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూకు పిల్లలంటే ఎంతో ఇష్టమని, పిల్లలను గులాబీ పూలు లాగా భావించి వారి సున్నిత మనసులు వికసించేలా పిల్లల దినోత్సవం ప్రత్యేకంగా నిలుస్తుందని తెలిపారు. మహనీయుల జీవితాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనపు సుకన్య ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కుల సాధనకు బిర్సా ముండా పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి!

- ఆదివాసీ చట్టాల అమలుకు ప్రతి గూడెంలో చైతన్య ఉద్యమం చేపడతాం
- ANS ఆధ్వర్యంలో ఘనంగా బిర్సా ముండా జయంతి వేడుకలు





వాజేడు, నవంబర్ 15 (భద్రాద్రి న్యూస్): ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, భూమి రక్షణ కోసం బ్రిటిష్ పాలకులు, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన విప్లవ యోధుడు బిర్సా ముండా ఆశయ సాధనకు ప్రతి ఆదివాసీ ముందుకు రావాలని ఆదివాసి నవనిర్మాణ సేన (ఆచీూ) ములుగు జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్ పిలుపునిచ్చారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ, చట్టాల అమలు కోసం బిర్సా ముండా పోరాట స్ఫూర్తితో ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ పోరాట యోధుడు బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని ఆదివారం వాజేడు మండల కేంద్రంలో ఆచీూ ఆదివాసి నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆచీూ రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ.. జార్ఖండ్ రాష్ట్రంలోని ఖుంటి జిల్లా ఉలిహతు గ్రామంలో 1875 నవంబర్ 15న జన్మించిన బిర్సా ముండా, ఆనాటి బ్రిటిష్ వలస పాలన, జమీందారీ వ్యవస్థ, భూదోపిడీ, బలవంతపు వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ఆదివాసీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి పోరాటం సాగించారని గుర్తుచేశారు. తన పోరాట పటిమతో బ్రిటిష్ పాలకులను సైతం ఎదిరించి ఆదివాసీల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. బిర్సా ముండా పోరాటాల ఫలితంగా 1908లో చోటానాగ్‌పూర్ కౌలుదారీ చట్టం (జప్ఫ్ఝీ చ్ఝీస్త్రజూబతీ ఎవఱుఅఎఎ ఆచీూ) అమలులోకి వచ్చిందని, ఈ చట్టం ద్వారా గిరిజనుల భూములను గిరిజనేతరులకు బదిలీ చేయకుండా రక్షణ కల్పించే న్యాయపరమైన వెసులుబాటు ఏర్పడిందని వివరించారు. అదే స్ఫూర్తితో నేటి ఆదివాసీ సమాజం కూడా తమ హక్కులు, భూములు, చట్టాల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ చట్టాలపై ప్రతి గూడెంలో అవగాహన కల్పిస్తూ, గ్రామగ్రామాన చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచీూ రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్, వాజేడు మండల కార్యదర్శి తల్లడి ప్రసాద్, నాయకులు పాయం శివాజీ, నాగలక్ష్మి, ఉయిక పార్వతి, ఉయిక సత్యబాబు, ఉయిక రమేష్, బొగ్గుల సూరిబాబు, ఉయిక శివ, పాయం శశిధర్, జెస్సిత, అభిజ్ఞాన్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానాభివృద్ధి

- జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ప్రారంభం
- సీనియర్ సిటిజన్ పాఠకులకు ఘన సన్మానం.. యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి: చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా





ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 15 (భద్రాద్రి న్యూస్): ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పుస్తక ప్రదర్శనను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి విశేష సేవలు అందిస్తూ, నిరంతరం పుస్తక పఠనాన్ని కొనసాగిస్తున్న సీనియర్ సిటిజన్ పాఠకులను చైర్మన్ ఘనంగా సన్మానించారు. అనంతరం పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించేందుకు ప్రత్యేకంగా బుక్ రీడింగ్ డ్రైవ్ నిర్వహించారు. పుస్తకాల ప్రాధాన్యత, రచయితల ఆలోచనలు, విజ్ఞానాభివృద్ధిలో పుస్తకాల పాత్రపై బుక్ టాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటూ పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని, తద్వారా విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజ, గ్రేడ్-1 లైబ్రేరియన్ సి. మల్సూర్, గ్రేడ్-3 లైబ్రేరియన్లు బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ పి. సంతోష్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొంగులేటి, ఎంపీ వద్దిరాజు, మాజీ ఎంపీ నామా

- జోషిత--గురునాథ్ వివాహ వేడుకకు హాజరైన రాజకీయ, సామాజిక ప్రముఖులు
- ఖమ్మంలో అంగరంగ వైభవంగా జరిగిన వివాహ మహోత్సవం





ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 15 (భద్రాద్రి న్యూస్): అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి జిల్లా యాదవ యువజన అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి యాదవ్--మాధవి దంపతుల కుమార్తె జోషిత, గురునాథ్‌ల వివాహ వేడుక ఆదివారం ఖమ్మంలోని బోనకల్ రోడ్డులో ఉన్న లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి, డాక్టర్ బానోత్ చంద్రావతి తదితర ప్రముఖులు హాజరయ్యారు. అలాగే కార్పొరేషన్ చైర్మన్లు మువ్వా విజయబాబు, రాయల నాగేశ్వరరావు, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి గంగదేవుల లోకేష్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాగదాని పుల్లారావు, ఓబీసీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మార్కెట్ చైర్మన్లు యరగొర్ల హనుమంతరావు, బోళ్ల గంగారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు జోషిత--గురునాథ్‌లపై అక్షింతలు చల్లి, పుష్పగుచ్ఛాలు అందించి ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, మండల అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, సీపీఐ రాష్ట్ర నాయకులు భాగం హేమంతరావు, తుళ్లూరి బ్రహ్మయ్య, నున్న నాగేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి లోడిగ వెంకన్న యాదవ్, దుబాకుల శ్రీనివాసు, తోటకూరి శివయ్య, తెల్లబోయిన రమణ, పుట్ట ఉపేందర్, బండారు ప్రభాకర్, చేతుల నాగేశ్వరరావు, మొరిమేకల కోటయ్య, సత్తి వెంకన్న, తుప్పాతి రవి తదితర రాజకీయ, సామాజిక ప్రముఖులు, పోలీసు శాఖ అధికారులు, బీసీ కుల సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
సోమవారం
16, నవంబర్, 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం



ఇగ్నైట్ స్కూల్‌లో అట్టహాసంగా బాలల దినోత్సవ వేడుకలు

- వివిధ వేషధారణల్లో అలరించిన చిన్నారులు
- నృత్యాలు, పాటలు, నాటికలతో ఆకట్టుకున్న విద్యార్థులు

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 15(భద్రాద్రిన్యూస్): స్థానిక కవిరాజు నగర్‌లోని ఇగ్నైట్ స్కూల్ జ్ఞాన సరస్వతి భవన్‌లో బాలల దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. దేశ ప్రథమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు సంప్రదాయ దుస్తులతో పాటు వివిధ రకాల ప్రత్యేక వేషధారణల్లో ముస్తాబై సందడి చేశారు. మదర్ థెరిసా, మిస్ ఇండియా, వైద్యురాలు, సైనికుడు, పోలీసు తదితర పాత్రలను పోషిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు, నాటికలు, లఘు నాటికలు, ప్రత్యేక వేషధారణ ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పాటి మాధవరావు మాట్లాడుతూ.. పిల్లలే దేశ భవిష్యత్తు అని, వారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చదువుతో పాటు సంస్కారం, క్రమశిక్షణ అలవర్చుకున్నప్పుడే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు, చదువుల్లో ప్రతిభ కనబరిచిన వారికి, ఉపాధ్యాయుల పాత్రలు పోషించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చివరగా విద్యార్థులందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాటి మాధవరావు, గౌరవ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

రక్తదాన సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు

- జాతీయ సేవా రత్న పురస్కారాలు అందుకున్న యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ సభ్యులు!
- గుంటూరులో ఘనంగా పురస్కారాల ప్రదానం



కొత్తగూడెం ,నవంబర్ 15 (భద్రాద్రిన్యూస్) :-రక్తదానం, సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేస్తున్న యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సభ్యులకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. గుంటూరులో కేబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 8వ వార్షికోత్సవం--2026 వేడుకల్లో క్లబ్ సభ్యులకు ప్రతిష్ఠాత్మక జాతీయ సేవా రత్న పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బృందానికి చెందిన కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు మొక్కల బాలు, క్లబ్ జిల్లా కార్యదర్శి రాజేష్, జుబ్బు, విజయ్ బ్లడ్ బ్యాంక్ భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జి బి. వినోద్ కుమార్‌లు తమ సేవలకు గుర్తింపుగా జాతీయ సేవా రత్న పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు జేబీ బాలు, వీరు, నిరంజన్ రెడ్డి, తారక్, ఆదాబ్ శ్రీనివాస్, గౌస్ పాషా, రంగనాథ్ తదితరులు పురస్కార గ్రహీతలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక సేవలో, ముఖ్యంగా రక్తదాన రంగంలో చేస్తున్న కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం పట్ల క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

స్నేహితులు అభిమానుల మధ్య ఘనంగా చల్ల తిరుమల్ రావు జన్మదిన వేడుకలు



కామేపల్లి, నవంబర్ 15 (భద్రాద్రి న్యూస్): మండలంలోని ముచ్చర్ల గ్రామంలో తిరుమల ట్రస్ట్ నిర్వాహకుడు చల్ల తిరుమల్ రావు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తిరుమల ట్రస్ట్ సభ్యులు స్నేహితులు అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి టపాసులు పేలిచి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రేగళ్ల రాము,గాడేపల్లి రవి,రాయల కోటయ్య, పాయల వెంకన్న, సురేష్‌తో పాటు పలువురు యువకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి శాఖల అధికారులు డుమ్మా కొడితే తగిన చర్యలు తప్పవ్

- వారి స్థానాల్లో కింది స్థాయి సిబ్బంది రాకూడదు
- జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా : ఎంపీడీవో ధరావత్ సోమ్‌లాల్



కామేపల్లి, నవంబర్ 15 (భద్రాద్రిన్యూస్): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే 'సీఎం ప్రజావాణి'కి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు స్వయంగా, విధిగా హాజరు కావాలని ఎంపీడీవో ధరావత్ సోమ్‌లాల్ ఆదేశించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ కార్యక్రమానికి గైర్హాజరైనా,తమ స్థానాల్లో కింది స్థాయి సిబ్బందిని పంపినా ఉపేక్షించేది లేదని ఆయన ఘాటుగా వాక్యనించారు. నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై జిల్లా కలెక్టర్ ఉన్నత అధికారులకు వివిధ శాఖల అధికారులు తమ విధులకు గైర హాజరు అయిన వారి నివేదిక పంపుతామని హెచ్చరించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- మాజీ ఎంపీ నామ
- కష్టపడే తత్వంతో అన్ని రంగాల్లో రాణింపు: మాజీ ఎంపీ నామ
- వన సమారాధనలతో సామాజిక ఐక్యత బలోపేతం: మాజీ ఎంపీ నామ



ఖమ్మం ప్రతినిధి,నవంబర్ 15 (భద్రాద్రిన్యూస్) : వైరా కమ్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీకమాస వన సమారాధన కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కార్తీకమాసం సందర్భంగా అందరినీ ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో పలుమార్లు ఆహ్వానించినా రాలేకపోయానని, ఇలాంటి ఆత్మీయ సమావేశాలు సమాజ ఐక్యతకు ఎంతో అవసరమని తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన కమ్మ సామాజిక వర్గం మొదటి నుంచి కష్టపడే తత్వం, పట్టుదలతో అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందన్నారు. దేశంతో పాటు విదేశాల్లోనూ తమ పిల్లలు ఉన్నత స్థానాల్లో స్థిరపడటం సంతోషకరమన్నారు. వ్యవసాయ రంగంతో పాటు విద్య, వ్యాపార, ఇతర రంగాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. అన్ని కులాలు, మతాల వారు బాగుండాలని, సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలనే ఆలోచనతో ముందుకు సాగాలని సూచించారు. రాబోయే రోజుల్లో రాజకీయాలు, వ్యాపార రంగాలతో పాటు అన్ని విషయాల్లోనూ మరింత ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో తనకు, పువ్వాడ అజయ్ కుమార్‌కు, ఇతరులకు వివిధ పదవులు రావడంలో సమాజ పెద్దల ఆశీర్వాదాలు, ప్రోత్సాహం ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ అందరి ఆశీర్వాదాలు తమకు ఉండాలని కోరారు. ఎక్కడైనా తమవారికి కష్టాలు, ఇబ్బందులు ఎదురైతే అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పిల్లల చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఏ రంగాన్ని ఎంచుకున్నా పట్టుదలతో ముందుకు సాగాలని నామ నాగేశ్వరరావు సూచించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ.. నామ నాగేశ్వరరావు టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా, బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేతగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. తెలంగాణ మలి దశ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర సాధనకు పార్లమెంటులో మొదటి ఓటు వేసిన విషయాన్ని గుర్తుచేశారు. తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేయడానికి మీ అందరి ఆశీర్వాదాలే కారణమని అన్నారు. సమాజం ఐక్యంగా ఉంటూ అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైరా కమ్మ సంఘం ప్రతినిధులు, ప్రముఖులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్తీకమాస వన సమారాధన వేడుకలు ఆత్మీయ వాతావరణంలో జరిగాయి.



ఘనంగా ప్రారంభమైన టీఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా ఏడవ మహాసభలు

- ఎర్రమయమైన ముదిగొండలి
- భారీ ర్యాలీతో కదం తొక్కిన ఉపాధ్యాయులు



ముదిగొండ,నవంబర్ 15 (భద్రాద్రిన్యూస్): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా ఏడవ మహాసభలు ముదిగొండ మండల కేంద్రంలో ఆదివారం స్థానిక నవతేజ ఫంక్షన్ హాల్ నందు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదట మహాసభల ప్రారంభ సూచకంగా జాతీయ జెండా, సంఘం ఉద్యమ పతాకాలు అయిన ఎస్.టి.ఎఫ్.ఐ, టీఎస్ యుటిఎఫ్ పతాకాలను సీనియర్ నాయకులు పులిగుండ్ల. సురేష్,నెల్లూరి వీరబాబు, మందడపు శ్రీనివాసరావు ఎగురవేసి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు.
అనంతరం అమరజీవి రావెళ్ల రాఘవయ్య ప్రాంగణంలో సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్ అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ సభలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ ప్రారంభ ఉపన్యాసం చేస్తూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సంక్షేమం కొరకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పనిచేస్తూ ఉపాధ్యాయుల గొంతుకుగా ఉంది అని అన్నారు. సిపిఎస్ రద్దు కొరకు, పిఆర్సి అమలు కొరకు ,పెండింగ్ బిల్లుల మంజూరు కొరకు వివిధ మేనేజ్మెంట్లలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అవిరళ పోరాటాలు యుటియఫ్ నిర్వహించిందని తెలియజేశారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీలో కీలక భూమిక పోషిస్తూ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం రాజీలేని పోరాటం చేస్తుందని తెలియజేశారు. విద్యారంగానికి తీవ్ర నష్టదాయకమైన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సంక్షేమం కొరకు ప్రారంభించిన టియస్ యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి పథకం నుండి రాష్ట్రవ్యాప్తంగా మరణించిన ఉపాధ్యాయులకు నాలుగు కోట్ల రూపాయలు విరాళం అందించడం జరిగిందని వారు తెలియజేశారు. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని, తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించి ,నర్సరీ,కెజి తరగతులు ప్రవేశపెట్టి , విద్యార్థులకు నాణ్యమైన విద్య అందచేయుటకు తగు చర్యలు తీసుకోవాలని, ఒక్క నూతన బడి కూడా తెలంగాణ రాష్ట్రంలో నిర్మించాల్సిన అవసరం లేదని , ఉన్న బడులతోనే అరవై లక్షల మందికి నాణ్యమైన చదువు ప్రభుత్వ రంగంలో ఉచితంగా అందించవచ్చని వారు తెలియజేశారు. హడావుడి, అసంబద్ధమైన నిర్ణయాలు కాకుండా అందరితో చర్చించి, సరైన విద్యాపాలసీ ప్రకటించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఓటర్ల తొలగింపు ప్రక్రియ చేపట్టిందని, ఈ ప్రక్రియ వలన అర్హులైన ఉపాధ్యాయులు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దుర్గాభవాని, పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు వెంకన్న, షమి, రాంబాబు, రాందాస్, సురేష్, వాసం రాంబాబు, సుధాకర్ రావు, నర్సయ్య, నాగేశ్వరరావు , వలీ, రామారావు, పద్మ, ఉద్దండ్,రామకృష్ణ, కోటేశ్వరరావు, ఉమామహేశ్వరరెడ్డి , విజయ్, ప్రశాంతి, సుధాకర్ పెనుమాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.





ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై విస్తృత ప్రచారం

కామేపల్లి నవంబర్ 15 (భద్రాద్రి న్యూస్) :
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రతి ఒక్క గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు నాయకులు గడపగడపకు విస్తృత ప్రచారం నిర్వహించాలని కామేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు పిలుపునిచ్చారు. ఇల్లందు నియోజవర్గం ఎమ్మెల్యే, శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ కోరం కనకయ్య ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామంలో ప్రజలకు ఈ పథకంపై అవగాహన కల్పించాలని కోరారు. కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. నవంబర్ 19న ఇందిరమ్మ జయంతి సందర్భంగా పథకాన్ని ప్రారంభించనున్నట్లు,నవంబర్ 20 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుకు అవసరమైన పత్రాలు: రేషన్ కార్డు,ఆధార్ కార్డు,ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్, బ్యాంకు ఖాతా వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని. మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని.వారు ఒక ప్రకటనలో సూచించారు.



నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొంగులేటి,ఎంపీ వద్దిరాజు,మాజీ ఎంపీ నామ

కామేపల్లి,నవంబర్15(భద్రాద్రి న్యూస్):
అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి జిల్లా యాదవ యువజన అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి యాదవ్,మాధవి దంపతుల కుమార్తె జోషిత వివాహం గురునాథ్‌తో ఆదివారం ఖమ్మంలోని బోనకల్ రోడ్డులో ఉన్న లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్,ఎంపీ వద్దిరాజు రవిచంద్ర,మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్,మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి,డాక్టర్ బానోత్ చంద్రావతి తదితర ప్రముఖులు హాజరయ్యారు.
అలాగే కార్పొరేషన్ చైర్మన్లు మువ్వ విజయబాబు, రాయల నాగేశ్వరరావు, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్,రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి గంగదేవుల లోకేష్ యాదవ్,బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాగదాని పుల్లారావు,ఓబీసీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం,మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మార్కెట్ కమిటీ చైర్మన్లు యరగొర్ల హనుమంతరావు, బోళ్ల గంగారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కలకాలం సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, కామేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు,మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, సీపీఐ రాష్ట్ర నాయకులు భాగం హేమంతరావు, తుళ్లూరి బ్రహ్మయ్య,నున్న నాగేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి లోడిగ వెంకన్న యాదవ్, దుబాకుల శ్రీనివాసు, తోటకూరి శివయ్య, తెల్లబోయిన రమణ,పుట్ట ఉపేందర్, బండారు ప్రభాకర్, చేతుల నాగేశ్వరరావు, మొరిమేకల కోటయ్య,సత్తి వెంకన్న,తుప్పాతి రవి తదితర ప్రముఖులు, పోలీసు శాఖ అధికారులు,బీసీ కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



